సాక్షి
తిరుపతి
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



సర్వ భూపాల వాహనంపై..
కల్యాణ వెంకన్న సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. నేడు గరుడ వాహన సేవ జరగనుంది. - 8లో



సిఫార్సుల జోరు..
అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు కూటమి నేతల కనుసన్నల్లో సాగాయి. వారు ఫిక్స్ చేసిన వారికే ఉద్యోగాలు అందనున్నాయి. - 8లో



రన్‌వే విస్తరణ పూర్తి
రేణిగుంట విమానాశ్రయంలో రన్‌వే విస్తరణ పనులు పూర్తయ్యాయి. 204 మీటర్ల మేర విస్తరణ చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

పరిహారం పెంచండి



ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న రైతులు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు- పూడి రైల్వే బైపాస్ మార్గానికి తీసుకున్న భూములకు పరిహారాన్ని పెంచాలని మండలంలోని ఎండీ పుత్తూరు, చుట్టుపక్కల రైతులు తిరుపతి ఎంపీ గురుమూర్తికి విన్నవించారు. పూడి- ఏర్పేడు మధ్య ప్రస్తుతం రైల్వే లైన్ సర్వే పనులు పూర్తయ్యాయని, రెవెన్యూ అధికారులు భూ పరిహారం విషయంలో పదేళ్ల కిందటి మార్కెట్ రేటును పరిగణనలోకి తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత మార్కెట్ రేటు ఎకరం రూ.కోట్లలో ఉండగా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ రేటు పది సంవత్సరాల కిందట గణాంకాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైల్వే లైను వెంబడి ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు అనువుగా పెద్ద కల్వర్టులను ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎంపీ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

తిరుపతి క్రైమ్: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు శుక్రవారం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'టీడీపీకి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు నిరంతరం వైఎస్ జగన్ ఫొటోలను మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారు. వారు సోషల్ మీడియాలో పెట్టే ఫొటోలు, వీడియోలు మాజీ ముఖ్యమంత్రి పరువు, ప్రతిష్టలను, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఉంటున్నాయి. టీడీపీకి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు హద్దులు మీరి పోస్టులు పెడుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఇలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.' అని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసినవారిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు ఉదయ వంశీ, పసుపులేటి సురేష్ రాయల్, అనిల్‌రెడ్డి, మల్లం రవికుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బి.ప్రకాష్ తదితరులు ఉన్నారు.

భక్తుడికే తొలి పూజ!

- శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంగరంగ వైభవంగా భక్తకన్నప్ప ధ్వజారోహణం
- తరలివచ్చిన భక్తజనం





భక్తకన్నప్ప ఆలయంలో అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం కన్నప్ప ధ్వజారోహణంతో ఆగమోక్తంగా అంకురార్పణ చేపట్టారు. తొలి పూజను భక్తునికే చెందేలా శివుడు వరమిచ్చాడు. ఈ క్రమంలో భక్తకన్నప్ప ధ్వజారోహణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తుడైన కన్నప్ప ఉత్సవమూర్తికి అభిషేక పూజలు నిర్వహించారు.

ముక్కోటి దేవతలకు ఆహ్వానం

కన్నప్ప ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కొండపై వెలసిన కన్నప్ప ఆలయం వద్ద ఉత్సవమూర్తిని కొలువుదీర్చి గణపతి పూజ, పుణ్యాహ వచనం, మండప ఆరాధన, ధ్వజపూజ నిర్వహించారు. అనంతరం దర్భ, మామిడాకులతో కట్టి తెల్లదారంతో దవళపతాకం, హారాన్ని ఎగురవేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ముల్లోకాల్లోని ముక్కోటి దేవతలకు సంకల్ప పూజతో వేదపండితులు శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు.

సంప్రదాయం..నైవేద్య సమర్పణం

తర్వాత కన్నప్ప ఉత్సవమూర్తిని తిరిగి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి సన్నిధి వీధిలో ఉభయదారులైన బోయ కులస్థులు ఏర్పాటు చేసిన విడిదిలో కొలువుదీర్చారు. బోయలు సంప్రదాయం ప్రకారం వస్త్రం, నైవేద్యం సమర్పించారు. అక్కడి నుంచి గ్రామోత్సవం ప్రారంభమైంది. రాజగోపురం నుంచి చతుర్మాడ వీధుల్లో కన్నప్ప గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

శాస్త్రోక్తంగా వాస్తు శాంతి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి వాస్తుశాంతి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామోత్సవం ముగిసిన తర్వాత ఆలయంలో వేదపండితులు గణపతి హోమం చేపట్టారు. అలాగే ఆలయానికి వాస్తు శాంతి హోమం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు(ఇన్‌సెట్) భక్తకన్నప్ప గ్రామోత్సవం

గత ప్రభుత్వంలో గెలిచిన ఇద్దరు కార్పొరేటర్లు చెలరేగిపోతున్నారు. కూటమి పంచన చేరి కబ్జాలకు దిగుతున్నారు. తిరుపతి నగరంలో ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ వాలిపోతున్నారు. అధికారుల ద్వారా వివరాలు తెప్పించుకుని రాత్రికి రాత్రే కంచె ఏర్పాటు చేస్తున్నారు. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకుని కూటమి పార్టీ నేతలే మరింత ప్రోత్సహిస్తున్నట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికారులు కూడా తమకెందుకులే అని చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. ఇదే అదనుగా కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ, మఠం భూములను కబ్జా చేస్తున్నారు. భూచోళ్ల అరాచకాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



ఆక్రమించుకున్న భూమి చుట్టూ కంచె ఏర్పాటు

భూచోళ్లు!

- ప్రభుత్వ, మఠం స్థలాలపై కన్నేసిన కార్పొరేటర్లు
- తిరుపతి నగరంలో ఖాళీ స్థలాలే లక్ష్యంగా చెలరేగిపోతున్న స్థానిక నేతలు
- ఆక్రమణలకు గురవుతున్న మఠం భూములు
- ఆక్రమణల కోసమే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరిన కార్పొరేటర్లు
- ఇప్పటికే నగరంలో పలుచోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న అక్రమార్కులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి నగరంలో కూటమిలో చేరిన ఇద్దరు కార్పొరేటర్ల ఆక్రమణలకు అంతేలేకుండా పోతోంది. ఆక్రమణల కోసమే ఆ కార్పొరేటర్లు.. టీడీపీ, జనసేనలో చేరినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. తాజాగా కోట్ల రూపాయల విలువచేసే మఠం భూమిని ఆక్రమించారు. ఆ స్థలం చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేశారు. ఆ కంచెపైన చెత్తాచెదారం వేయరాదని బోర్డు కూడా ఏర్పాటు చేశారు. దీన్ని చూసి స్థానికులు ఔరా? అని ముక్కున వేలేసుకుంటున్నారు.

వివరాల సేకరణతో సరి

కార్పొరేటర్ల ఆక్రమణ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఆ భూమి రెవెన్యూకి సంబంధించినదా? మఠానికి చెందినదా? అదేవిధంగా తిరుపతి రూరల్ మండలంలో ఉందా? అర్బన్‌లో ఉందా? అనే వివరాలు సేకరించి కార్పొరేషన్ అధికారులకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. అక్రమించుకుంటున్న వారు ప్రస్తుతం అధికార పార్టీలో ఉండడంతో అధికారులు అటువైపు వెళ్లడానికి సాహసించడం లేదని ప్రచారం జరుగుతోంది.



ఆక్రమణకు గురైన మఠం భూమి

ప్రశ్నిస్తే దాడే!



కంచె ఏర్పాటు చేసే సమయంలో స్థానికుడు ఒకరు ప్రశ్నిస్తే అతనిపై దాడిచేసినట్లు విశ్వసనీయ సమాచారం. బాధితుడు పోలీసుకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వారం రోజులుగా విలువైన మఠం భూమి ఆక్రమణ పనులు సాగుతున్నాయి.

కుటిల రాజకీయం

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లుగా గెలిచి అధికారాన్ని అనుభవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. టీడీపీ, జనసేన నేతల అవసరాన్ని ఆసరగా మలచుకుని ఆ పార్టీల్లో చేరిపోయారు. ఆ పార్టీల్లో చేరే సమయంలోనే వారి డిమాండ్లను కూటమి నేతల ముందుంచినట్లు తెలిసింది. డెప్యూటీ మేయర్ పదవిని ఎలాగైనా కైవశం చేసుకోవాలనే దురుద్దేశంతో కూటమి నేతలు వారి డిమాండ్లను అంగీకరించినట్టు చర్చసాగుతోంది. డెప్యూటీ మేయర్ ఉప ఎన్నిక పూర్తయిన వెంటనే.. పార్టీ మారిన కొందరు కార్పొరేటర్లు తమ ప్రతాపాన్ని చూపించడం ప్రారంభించారు.

'ముంచే'స్తారా?

ఇదే ప్రాంతంలో ఇది వరకే ఓ కార్పొరేటర్ అండదండలతో కాలువపైన నిర్మాణాలు చేపట్టి ఉన్నారు. అదే కార్పొరేటర్, మరో కార్పొరేటర్ కలిసి ఖాళీగా ఉన్న భూమిని ఆక్రమించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ భూమి ఆక్రమణ పూర్తయితే వరద నీరు వస్తే ఆ ప్రాంతం జలదిగ్బంధంలో చిక్కుకోక తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి వరద ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు.

మాకు అడ్డెవరు?

గత ప్రభుత్వ హయాంలో తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేశారు. ఈ రోడ్ల ఏర్పాటు అనంతరం తిరుపతి నగరం రూపురేఖలు మారిపోయాయి. ఫలితంగా తిరుపతి నగరంలో నివాస స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే చెలరేగిపోతున్నారు. నగరంలో ప్రభుత్వ, పోరంబోకు, కాలువ, చెరువు పోరంబోకు, మఠం భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో.. అధికారుల ద్వారా వివరాలు తెప్పించుకుంటున్నారు. ఆపై రాత్రికి రాత్రే వాటిని ఆక్రమించేస్తున్నారు. ఇద్దరు ముఖ్యమైన కార్పొరేటర్లు తిరుపతి అర్బన్ పరిధిలోని కేశవాయన గుంట పరిధిలో రూ.కోట్ల విలువైన మఠం భూమిపై కన్నేశారు. సర్వే నం.57లో ఉన్న మఠం భూమి ఖాళీగా ఉండడంతో స్థానికులు చెత్తాచెదారం అందులో పడేసేవారు. కార్పొరేటర్లు ఆ ఖాళీ జాగాను శుభ్రం చేసి రాత్రికి రాత్రే కంచె ఏర్పాటు చేశారు

అ'ద్వితీయ'ం..
అపు'రూపం'

- ఒకే రూపంతో అమ్మ గీసిన బొమ్మలు
- అభిరుచులూ ఒకటేనంటున్న ట్విన్స్
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

తిరుపతి సిటీ: సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని పెద్దలు చెబుతుంటారు. ఆ ఏడుగురు ఎవరో.. ఎక్కడుంటారో ఎవరికీ తెలియదు. కానీ అందులో ఒకే రూపం కలిగిన ఇద్దరు ఒకే ఇంట్లో ఉంటే అదో గొప్ప అనుభూతే. తిరుపతిలో అలాంటి పిల్లలు వందల మంది ఉన్నారంటే నమ్మశక్యంగా లేదుకదూ. ఓ ప్రైవేటు సంస్థ ప్రతి ఏడాదీ కవలల దినోత్సవాన్ని తిరుపతిలో ఘనంగా నిర్వహిస్తోంది. ట్విన్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఇచ్చిన వివరాల మేరకు కేవలం తిరుపతి జిల్లాలో కవలలు సుమారు 12 వేల పైచిలుకు ఉన్నారంటే ఆశ్చర్యకరమైన విషయమే.

ఇది మీకు తెలుసా?

ప్రతి ఏడాదీ ఫిబ్రవరి 22న ప్రపంచ కవలల దినోత్సవం జరుపుకునేందుకు ఓ ప్రత్యేక సందర్భం ఉంది. ప్రపంచంలో మొదటి సారి కవలల దినోత్సవాన్ని పోలెండ్ దేశంలో 1976లో నిర్వహించారు. పోలెండ్‌లో మోజన్, ఆరన్ విల్‌కాక్స్ అనే కవలలు తాము నివసిస్తున్న ఊరుకి ట్విన్‌బర్గ్ అని పేరు పెట్టుకున్నారు. అనుబంధాన్ని విడవకూడదనే ఉద్దేశంతో ఒకే ఇంట్లోని అక్కాచెల్లెళ్లను పెళ్లి చేసుకున్నారు. గుర్తుతెలియని వ్యాధితో ఇద్దరూ ఒకే రోజు అంటే ఫిబ్రవరి 22న మరణించారు. వారి గౌరవార్థం నాటి నుంచి ట్విన్స్‌డేని జరుపుకుంటున్నాయి.



తిరుపతిలో నిర్వహించిన ట్విన్స్ డేలో కవలలు (ఫైల్)

నేడు తిరుపతిలో ఘనంగా ట్విన్స్‌డే

స్థానిక సీపీఎం కార్యాలయం వేదికగా ట్విన్స్ ఆర్గనైజేషన్ సంస్థ శనివారం అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి తెలుగు కవల పిల్లలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న కవలలు హాజరుకానున్నారు.

అయోమయం అవుతుంటారు



మాది తిరుపతి. తల్లిదండ్రులకు మూడో సంతానంగా మేము జన్మించాం. ఒకే డ్రస్ వేసుకుంటాం. చిన్ననాటి నుంచి ఇద్దరం ఒకే తరగతిలో చదివాం. ప్రస్తుతం బెంగళూరులోని ఒకే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాం. కంపెనీ యాజమాన్యం, ఉద్యోగులు మమ్మలను ఇప్పటికీ గుర్తించలేరు. కన్ఫ్యూజ్ అవుతుంటారు.

-హేమావతి, హేమలత, తిరుపతి

ఒకే ఆలోచనలు



మాది స్వస్థలం కడప. తిరుపతితో అనుబంధం ఎక్కువ. మాకు దాదాపు ఒకే రకమైన ఆలోచనలు, అలవాట్లు ఉంటాయి. మా జీవిన శైలి ఆసక్తికరంగా ఉంటుంది. మమ్మల్ని చూసి చాలా మంది పోల్చుకోలేక తికమక పడుతుంటారు. బెంగళూరులో ఓ ప్రముఖ కంపెనీలో పనిచేస్తున్నాం. సంస్థలోని ఉద్యోగులు మమ్ములను గుర్తించడంలో ఇబ్బంది పడుతుంటారు.

-రామ్, లక్ష్మణ్, తిరుపతి

తల్లిదండ్రులే గుర్తుపట్టలేరు



మేము మా తల్లిదండ్రులకు రెండో సంతానం. ఇద్దరం రూపంలోనూ, ఎత్తులోనూ ఒకటిగానే ఉంటాం. తల్లిదండ్రులు సైతం మమ్ముల్ని గుర్తుపట్టలేరు. ఏవైనా పనులు చెప్పడం, పిలవడంలో ఒకరికి చెప్పేవి మరొకరి చెబుతుంటే నవ్వొస్తుంది. మేము ఓ ప్రైవేటు పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాం.

-చరణశ్రీ, చరణ్యశ్రీ, తిరుపతి

అందరిచూపూ మాపైనే



తల్లిదండ్రులకు మేము నలుగురం కవలల. శృతి, ప్రీతి కవలుగా తొలి సంతానంలో జన్మించాం. మరో ఇద్దరు సిరివెన్నెల, వివేక్ కవలలుగా రెండో సంతానంలో పుట్టాం. ముగ్గురు ఆడపిల్లలం ఒకే రూపంలో ఉంటాం. అమ్మ గీసిన అచ్చు బొమ్మలం. ఏదైనా ఫంక్షన్లకు వెళితే అందరి చూపు మాపైనే ఉంటుంది.

-శ్రుతి, ప్రీతి, సిరివెన్నెల, వివేక్, తిరుపతి

అదృష్టంగా భావిస్తున్నాం



మాది పీలేరు. తిరుపతిలోనే ప్రతి ఏడాదీ తిరుపతిలో జరిగే ట్విన్స్‌డేకి హాజరవుతుంటాం. మేము ఇద్దరం ఒకేసారి వస్తుంటే ఇంట్లో వాళ్లతో పాటు బంధువులు సైతం తికమకపడుతారు. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాం. కలలుగా పుట్టడం అదృష్టంగా భావిస్తున్నాం.

-హస్సేన్, హుస్సేన్, తిరుపతి

అభిరుచులు ఒక్కటే



వడమాలపేట మండలం, యనమలపాళ్యం గ్రామంలోని మధు, లత దంపతుల కవలలు ప్రగతి, ప్రనతి. వీరిద్దరి అభిరుచులు ఒకేలా ఉంటాయి. ఆటపాటల్లో, చదువుల్లో ఇద్దరూ ఒకేలా వ్యవహరిస్తారు. కొత్తవారు చూసినప్పుడు ఎవరి పేరు ఏమిటో గుర్తుపట్టలేని విధంగా ఉంటారు.

- ప్రగతి, ప్రణతి

ఇద్దరూ ఇద్దరే



చిల్లకూరు మండలం, కమ్మవారిపాళెంకు చెందిన మోరా నాగరాజు, ప్రసూనాలకు రెండో సంతానంగా ఇద్దరు మగ కవల పిలలు పుట్టారు. వీరు చిన్న నాటి నుంచి ఏది చేసినా ఒక్కటిగానే చేస్తుంటారు. వీరు చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు.

జోషి, జీవన్, కమ్మవారిపాళెం, చిల్లకూరు మండలం

గుర్తించాలంటే కాస్త టైమ్ పడుతుంది



మాది తిరుపతి. ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదోదవ తరగతి చదువుతున్నాం. ఒకే నిమిషం తేడాతో జన్మించాం. తల్లిదండ్రులు మమ్ముల్ని గుర్తించినా బంధువులు, స్నేహితులు గుర్తించేందుకు కాస్త టైమ్ పడుతుంది. తదేకంగా గమనిస్తేనే గుర్తుపట్టగలరు.

-లక్ష్మీ అక్షయ, లక్ష్మీ ఐశ్వర్య, తిరుపతి

అట్టహాసంగా తిరుత్సవ-2025



రేస్ కారును ప్రారంభిస్తున్న సంగీత దర్శకుడు తమన్, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్.సత్యనారాయణ


- నూతన ఆవిష్కరణలకు ఐఐటీ కేంద్రబిందువు కావాలన్న వక్తలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో శుక్రవారం తిరుత్సవ-2025 పేరిట నిర్వహించిన టెక్నో కల్చరల్ ఫెస్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా తెలుగు సినీ సంగీత దర్శకులు ఎస్ఎస్ తమన్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులే నిర్వహించే ఈ ఉత్సవం ఈ సారి అద్వితీయంగా ప్రారంభమైందన్నారు. ఐఐటీ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అతిథులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. అంతకు ముందు ఉదయం విద్యార్థులు స్క్విడ్ గేమ్స్, జర్నీ ఫర్ రిచెస్, అనలాగ్ మిస్టరీ వంటి జిజ్ఞాసతో కూడిన ఆటలను ఆడి ప్రశంసలందుకున్నారు.





సంగీత దర్శకుడికి ఆత్మీయ సత్కారం



ఐఐటీ విహంగ వీక్షణ



ఐ లవ్ తిరుత్సవ



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

క్లుప్తంగా

భీమానదిని చెరబట్టారు!

- సీసీ రోడ్ల నిర్మాణం పేరిట అక్రమ ఇసుక రవాణా



ఏ.రంగంపేట పంచాయతీ దర్శి దళితవాడ వద్ద భీమానది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక

చంద్రగిరి: ఏ.రంగంపేట సమీపంలోని భీమానదిపై టీడీపీ నేతలు కన్నేశారు. శుక్రవారం ఉదయం జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇష్టారాజ్యంగా ఇసుకను లోడేశారు. నిత్యం ఓ వ్యక్తి కబ్జాలు, ఆక్రమణలు, ఇప్పుడు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపించారు. అధికారులు సైతం ఆయనకు సంపూర్ణంగా సహకరిస్తున్నారని అంటున్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ఇసుక రవాణా చేస్తున్నారంటూ ప్రచారం చేసుకుని దొడ్డిదారిలో బయట ప్రాంతాలకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు. సీసీ రోడ్లను ఉచితంగా వేయడం లేదు కదా.. మరి అలాంటప్పుడు మండలంలో ఎక్కడా ఇసుక రీచ్ లేనప్పటికీ రెవెన్యూ అధికారులు ఎలా అనుమతులు ఇస్తారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి



ఈస్ట్ పోలీస్ స్టేషన్లో తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైం: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ప్రతి ఒక్కరూ మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. శుక్రవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటిగా సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. బీట్ సిస్టమ్ బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బంది ఎవరెవరు డ్యూటీ చేస్తున్నారు, వారి పనితీరు గురించి ఆరా తీశారు. ఎఫ్ఐఆర్ ఇండక్షన్‌లో ముద్దాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీడీల వివరాలపై ఆరా తీశారు.

సిఫార్సుల జోరు.. నిరుద్యోగుల బేజారు!

- మొక్కుబడిగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు
- గల్లీ లీడర్ల నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు సిఫార్సులు
- వారు సూచించిన వారికే ఉద్యోగాలు!
- అయోమయంలో అర్హులు!



తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ ఉద్యోగాల భర్తీకి సిఫార్సుల జోరు పెరిగిపోయింది. గల్లీ లీడర్ల నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు తమ వారికంటే తమ వారికంటూ పంచేసుకున్నారు. ఆపై లెటర్ ప్యాడ్లు ఇచ్చి ఇంటర్వ్యూలకు పంపారు. ఏ ఉద్యోగం ఎవరికి ఇవ్వాలో ముందే ఫిక్స్ చేసినట్లు చర్చసాగుతోంది. దీంతో అర్హులైన వారు తమకు ఉద్యోగం వస్తుందో లేదోనని అయోమయంలో మునిగిపోయారు.

లెటర్లు.. బెదిరింపులు

జిల్లాలో 101 అంగన్‌వాడీ ఉద్యోగాలకు 192 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన అధికార పార్టీ గల్లీ లీడర్లు ఆ పోస్టుకు ఎమ్మెల్యే లెటర్ ఇచ్చారు.. మేము సిపార్స్ చేసిన వారికే ఉద్యోగం వస్తుంది అంటూ ప్రచారం చేసినట్లు తెలిసింది. అంతేగాకుండా తమను కాదని దరఖాస్తు చేసుకుంటే ఆ తర్వాత ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో జిల్లాలో 101 ఉద్యోగాలకు 192 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది.

కమిటీ సభ్యులు ఎక్కడో?

జిల్లాలోని 101 అంగన్‌వాడీ ఉద్యోగాలను నలుగురు సభ్యులతో కూడిన కమిటీ నేతృత్వంలో ఇంటర్వ్యూలు చేపట్టి ఎంపిక చేయాల్సి ఉంది. ఇందులో ఐసీడీఎస్ పీడీ, ఐసీడీఎస్ సీడీపీఓ, డీఎంహెచ్‌ఓ, ఆర్డీఓ కమిటీలో ఉండాలి. తిరుపతిలో శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూల్లో ఐసీడీఎస్ పీడీ, ఐసీడీఎస్ సీడీపీఓ హాజరయ్యారు. డీఎంహెచ్‌ఓకు బదులుగా సీనియర్ అసిస్టెంట్, ఆర్డీఓకు బదులుగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హాజరు కావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ముగిసిన ఇంటర్వ్యూలు

జిల్లాలో 17 అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగులు, 11 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాలు, 73 అంగన్‌వాడీ సహాయకులు(హెల్పర్లు) పోస్టుల భర్తీకి గత ఏడాది డిసెంబర్ 22న నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ఏడాది జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరించారు. గత మూడు రోజులుగా శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, తిరుపతి ఆర్డీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మరో వారం రోజుల్లో పోస్టులు కేటాయించనున్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు



అంగన్‌వాడీ ఉద్యోగాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల ఆర్డీఓ కార్యాలయాల్లో పారదర్శకంగానే ఇంటర్వ్యూలు నిర్వహించాం. మరో వారం పది రోజుల్లో వారికి పోస్టులు ఇవ్వడం జరుగుతుంది. మాకు సిఫార్స్ లెటర్లు ఏమీ రాలేదు. వచ్చినా వాటిని పట్టించుకోం. అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేస్తాం.

–వసంత బాయి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్

కాలంచెల్లిన బస్సుతోనే ప్రమాదం

నారాయణస్కూల్‌పై చర్యలు తీసుకోండి



డీఈఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న నేతలు

తిరుపతి అర్బన్: కాలం చెల్లిన బస్సులను వినియోగించడంతోపాటు అధిక సంఖ్యలో పిల్లలను ఎక్కించుకోవడం, అతి వేగంతోనే సూళ్లూరుపేట వద్ద నారాయణ స్కూల్ బస్సు ప్రమాదానికి గురైందని విద్యార్థి సంఘం నేతలు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో డీఈఓ కేవీఎన్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. నారాయణ స్కూల్‌ను పరిశీలించి ఆ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌ఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఏపీవీహెచ్‌ఎస్ సంఘాలకు చెందిన విద్యార్థి నేతలు మన్నెం ప్రేమ్‌కుమార్, హెచ్.లోకేష్, ఎం.ముని, సాయి, పవన్, హరి పాల్గొన్నారు.

రన్‌వే విస్తరణ పూర్తి

- అంతర్జాతీయ విమాన సర్వీసులకు మార్గం సుగుమం



తిరుపతి విమానాశ్రయ రన్‌వే విస్తరణ పనులు

రేణిగుంట: తిరుపతి నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిపేందుకు మార్గం సుగుమమైంది. రన్‌వే విస్తరణ పనులు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నె ఆధ్వర్యంలో పూర్తయ్యాయి. ఐఎల్ఎస్, డీవీఓఆర్, డీఎంఈతో పాటు 240 మీటర్ల విమానాశ్రయ రన్‌వే విస్తరణ పనులను పూర్తి చేసినట్లు డైరెక్టర్ శుక్రవారం వెల్లడించారు. ఈ పనులను రెండు రోజుల కిందట కమిషనింగ్ మెంబర్ ఎం.సురేశ్ వర్చువల్ మోడ్ ద్వారా ప్రారంభించారు. ప్లానింగ్ సభ్యుడు ఏకే గుప్తా సమక్షంలో పనులు జరిగాయి. తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు మన్నె, విమానాశ్రయ సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అన్ని ప్రాజెక్టులలో మొత్తం రూ.153.16 కోట్లు ఖర్చు చేసినట్లు డైరెక్టర్ తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు విమానాశ్రయ కార్యక్రమాలను మెరుగుపరుస్తాయన్నారు. డాప్లర్ వెరీ హై ఫ్రీక్వెన్సీ ఓమ్ని రేంజ్ అండ్ డిస్టెన్స్ మెజరింగ్ ఎక్విప్మెంట్ రన్‌వే-26 కోసం కొత్త మోపియన్స్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. రూ.5.6కోట్ల వ్యయంతో చేపట్టిన డీఎంఈ పనుల ద్వారా గరిష్ఠ విమానాల నిర్వహణ సామర్థ్యం రోజుకు 100 విమానాల నుంచి 200 విమానాలకు పెరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న రన్ వేలన్నింటిలోకెల్లా తిరుపతి రన్‌వే అత్యంత పొడవైనదని ఆయన స్పష్టం చేశారు. రన్‌వే విస్తరణ పనులకు మొత్తం రూ.143.15 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

రేపు విశ్వంలో సైనిక్ ఉచిత నమూనా పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఉచితంగా సైనిక్ నమూనా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సైనిక్ స్కూల్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా నమూన పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సైనిక్ ప్రవేశ పరీక్ష, పరీక్షా విధానం తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బ్యాంకు సొమ్ము స్వాహా కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: తిరుపతి బాలాజీ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ సొమ్ము స్వాహా కేసులో భార్యాభర్తలు డి.నాగమణి, డి.నాగరాజబాబుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణారెడ్డి కథనం మేరకు.. తిరుపతి కోలా వీధికి చెందిన డి.నాగమణి, తిరుపతి బాలాజీ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌లో అకౌంటెంట్‌గా, ఆమె భర్త డి.నాగరాజా బాబు క్యాషియర్‌గా పనిచేసేవారు. 2002 సెప్టెంబర్ 28 నుంచి 2006 ఫిబ్రవరి 10వ తేదీ మధ్య ఇద్దరు బ్యాంకుకు చెందిన రూ.1,13,39000లను ఫోర్జరీ సంతకాలు చేసి స్వాహా చేశారు. దీనిపై బ్యాంకు మేనేజర్ ఏ.మునిరామయ్య తిరుపతి క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు కేసు దర్యాప్తు చేసి ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో డి నాగమణికి రెండేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా, నాగరాజబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శిరీష వాదించారు.

కారును ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- చిన్నారి మృతి
- మరో ఇద్దరికి గాయాలు



బిడ్డ మృత దేహం వద్ద విలపిస్తున్న తండ్రి

తిరుపతి రూరల్: నాయుడుపేట – పూతలపట్టు జాతీయరహదారి రామచంద్రాపురం జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందగా ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసుల సమాచారం మేరకు.. అనంతపురం జిల్లా కదిరికి చెందిన వేణుగోపాల్ భార్య అశ్విని, కుమార్తె హరిప్రియతో కలసి కారులో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం చేసుకుని తిరుమల వెళ్లేందుకు ఆర్‌సీపురం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. జాతీయ రహదారి నుంచి తిరుపతి నగరంలోకి మలుపు తీసుకునే క్రమంలో బెంగళూరు నుంచి తిరుపతికి వస్తున్న ట్రావెల్స్ బస్సు అతివేగంగా వచ్చి కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నాలుగేళ్ల చిన్నారి హరిప్రియ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

– గుర్తుతెలియని వ్యక్తి మృతి



తిరుపతి రూరల్: తిరుపతి – చంద్రగిరి మార్గంలోని పేరూరు పంచాయతీ గరుడ ఎన్‌క్లేవ్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. చంద్రగిరి నుంచి తిరుపతికి వెళుతున్న ఆటోడ్రైవర్ ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి డివైడర్‌ను గుద్దాడు. దీంతో బాలాజీ కాలనీలోని ఓ హాస్టల్‌కు సరుకులు తీసుకొని ద్విచక్ర వాహనంలో వెళుతున్న గంగాధర్, బాబుకు గాయలవగా ఆటోలో ప్రయాణిస్తున్న యశోదతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 వాహనంలో రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు వద్ద ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి సుమారు 55 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు తిరుపతి రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ ఎస్‌కె.మూర్తి వెల్లడించారు.

సర్వ భూపాల వాహనంపై వెంకన్న కటాక్షం

- ఉదయం కల్పవృక్షంపై రాజమన్నార్‌గా ఊరేగిన దేవదేవుడు
- నేడు గరుడ వాహన సేవ



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న సర్వాంతర్యామి

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం రాత్రి స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా సర్వభూపాల వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కాగా ఉదయం స్వామి వారు శ్రీరాజమన్నార్ అలంకరణలో చంద్రాకోలు, దండం ధరించి కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. సాయంత్రం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా నాలుగు మాడ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపీనాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు శనివారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు తనకు ఇష్టమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం స్వామి వారు మోహినీ అవతారంలో పల్లకీలో ఊరేగనున్నారు. అధికారులు గరుడ సేవకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు శ్రీవారి లక్ష్మీహారం శోభాయాత్ర

శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించనున్న గరుడ సేవకు శ్రీవారి లక్ష్మీహారాన్ని అలంకరించనున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం శ్రీవారి లక్ష్మీహారాన్ని తీసుకుని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుంది.

మాస్టర్ ప్లాన్ ప్రకారం పెంచలకోన అభివృద్ధి



ప్రదక్షిణ చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే

రాపూరు: మాస్టర్ ప్లాన్ ప్రకారం పెంచలకోన క్షేత్రం అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పెంచలకోనలోని శ్రీపెనుశిలలక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, ఆంజనేయ స్వామిని శుక్రవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలసి దర్శించుకున్నారు. వారికి దేవస్థాన వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం స్వామి,అమ్మవార్ల లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. ఆయన వెంట మెట్టుకూరు ధనంజయరెడ్డి, ఈఓ శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

కరాటేలో నోబెల్ బుక్ ఆఫ్ రికార్డు



నీలేష్

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, చిగురువాడకు చెందిన కుర్రకాల్వ నీలేష్ షిటోరియో కరాటేలో నోబెల్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. గత ఏడాది జనవరిలో గుంటూరు కేంద్రంగా జరిగిన కరాటే పోటీల్లో ప్రత్యర్థిపై కాంటాక్ట్ పంచులు విసిరినందుకు గాను నోబల్ వరల్డ్ రికార్డు (నెంబరు ఐఎన్ 24103130) సాధించాడు. ఈమేరకు నోబెల్ వరల్డ్ రికార్డ్స్ వారు సర్టిఫికెట్‌ను పోస్టు ద్వారా పంపారు. దీంతో నోబెల్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన నీలేష్‌ను గ్రామస్తులు, శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ అనీల్‌ను గ్రామస్తులు అభినందించారు.

టీటీడీ ఉద్యోగుల ఆందోళన విరమణ

తిరుమల : టీటీడీ ఉద్యోగిపై అసభ్య పదజాలంతో దూషించిన బోర్డు సభ్యుడి క్షమాపణతో శుక్రవారం ఆందోళన విరమించారు. మూడు రోజుల క్రితం టీటీడీ ఉద్యోగి బాలాజీసింగ్‌ను బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ అసభ్యపదజాలంతో దూషించడంతో ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి టీటీడీ ఉద్యోగ సంఘాలతో చర్చలు ప్రారంభించారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు నరేష కుమార్, భానుప్రకాష్ రెడ్డి, బాధితుడు బాలాజీసింగ్, ఉద్యోగ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. సుదీర్ఘంగా చర్చించిన అనంతరం బోర్డు సభ్యుడు నరేష్ కుమార్, ఉద్యోగి బాలాజీ సింగ్‌కు క్షమాపణ చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఇతర సమస్యలు రెండు, మూడు నెలల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

స్కిల్‌డెవలప్‌మెంట్‌తోనే ఉద్యోగాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఇంజినీరింగ్ విద్యార్థినులు అకడమిక్ విద్యతో పాటు ప్రధానంగా ఆధునిక సాంకేతికతపై నైపుణ్యాన్ని పెంచుకోవాలని గాదంకి ఎన్ఏఆర్ఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ హెచ్ఓడీ డాక్టర్ కేకేఎస్‌వీవీ ప్రకాష్‌రావు సూచించారు. పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో విద్యుత్సవ్-2025 పేరుతో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవ ప్రారంభోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, ప్రొఫెసర్ వీరారెడ్డి, అధ్యాపకులు హిమబిందు, కే.షాలిని, పార్థవిసాయి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్టైఫండ్‌కు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సౌత్ జోన్ స్పోర్ట్స్ స్టైఫండ్ కోసం అర్హత కలిగిన ప్రతిభావంతులైన క్రీడాకారులు 2025–26 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ తెలిపారు. ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్‌కు సంబంధించి బాలురు, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాలకు సంబంధించి బాలబాలికలు అర్హులని తెలిపారు. 15 నుంచి 18, 18 నుంచి 24 ఏళ్ల లోపు వారు మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో చూడాలని సూచించారు.

అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ లక్ష్యమని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా కలెక్టర్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి పురోగతిపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి గత సమావేశానికి చెందిన పలు అంశాల్లో పురోగతిని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గూడూరులో అంబేడ్కర్ భవనాన్ని పరిశీలించి మరమ్మత్తులు చేయాలని చెప్పారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి జాప్యం లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డీఆర్ఓ నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామమోహన్, భాను ప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రమ్ కుమార్‌రెడ్డి, డీపీఓ సుశీల దేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఈఓ కేవీఎన్ కుమార్, తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట డీఎస్పీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మీ సేవలు అమూల్యం

సఫాయి కర్మచారీల సేవలు అమూల్యమైనవని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కొనియాడారు. కలెక్టరేట్‌లో జిల్లా మాన్యువల్ స్కావెంజర్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హాజరై ప్రసంగించారు.

తల్లికి కుమార్తె అంతిమ సంస్కారాలు



ఏర్పేడు మండలం, పంగూరులో తల్లికి అంతిమ సంస్కారాలు చేస్తున్న కుమార్తె భారతి

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం పంగూరులో శుక్రవారం తల్లికి కుమార్తె దహన సంస్కారాలు నిర్వహించింది. చావాలి సుబ్బరామయ్య, పుల్లమ్మ దంపతులకు సుబ్బరత్న, భూదేవి, భారతి కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేరు. తండ్రి అనారోగ్యంతో చాలా ఏళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి పుల్లమ్మ ముగ్గురు ఆడబిడ్డలను కష్టపడి చదివించి పెంచి, పెద్ద చేసి వివాహాలు చేసింది. చిన్న కుమార్తె భారతి పీలేరులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వయోభారంతో పుల్లమ్మ గురువారం మృతి చెందింది. తల్లి మరణవార్త విని కుమార్తె భారతి తల్లడిల్లిపోయింది. పంగూరుకు చేరుకుని తల్లి మృతదేహం వద్ద బోరున విలపించింది. మహిళలు శ్మశానానికి వెళ్లకూడదని గ్రామస్తులు వారించినా ఖాతరు చేయకుండా తల్లి చితికి కొరివి పెట్టి కన్నతల్లి రుణం తీర్చుకుంది.

హామీని నిలబెట్టుకోండి



ధర్నా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తిరుపతి ఉద్యోగ సంఘం నేతలు విజయ భాస్కర్, .దన్వంత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలోని రామానుజుల సర్కిల్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద బ్యాంక్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నేతలు మాట్లాడుతూ గత ఏడాది బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారనికి సంబంధించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు వారంలో ఐదు రోజులు మాత్రమే బ్యాంక్ ఉద్యోగులకు పనిదినాలు ఉండాలని స్పష్టం చేశారు. ఉద్యోగ సఘం సభ్యులు సుమలత, రేష్మ, నిర్మల, వెంకటలక్ష్మి, జనార్దన్, భాస్కర్, కేశవరెడ్డి, మహేష్, విష్ణుష్ బాబు, నందకుమార్, పవన్, శంకర్ రావు, లక్ష్మీపతి, నటరాజ్, శివశంకర్ పాల్గొన్నారు.